క్లుప్తంగా

15న తృతీయ వార్షికోత్సవం

కోటనందూరు: ఈ నెల 15వ తేదీన పాతకొట్టాం సీతారామచంద్రస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు సప్త నదుల జలాలతో నింపిన కలశాల యాత్ర జరుగుతుందన్నారు. అనంతరం వేదపండితులు స్వామివారికి సప్తనదీ జలాలు, పంచామృతాలతో అభిషేకం, హోమం, వార్షిక కల్యాణం, స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. కలశయాత్రలో పాల్గొనాలనుకునే మహిళలు బుధవారం సాయంత్రం లోగా 90520 4718, 85004 77729 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కోటనందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు వర్తించాలంటే రైతులు విధిగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వో, వీఏఏలకు మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకునే రైతులు ఆధార్‌కార్డు, 1బీ అడంగల్, ఆధార్‌తో లింకైన ఫోన్‌నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నల్లమిల్లి సురేష్, కేవీ శివ కుమారి, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

ఏలేశ్వరం: బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని యర్రవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కురాకులరాజా ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీనాయకులు పార్టీనాయకులు గరికి నాగు, గొడుగు నల్లబ్బాయి, బండారు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల క్రయ విక్రయాల నిలిపివేత

ప్రత్తిపాడు: బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతున్నందున ప్రత్తిపాడు మండలంలో కోళ్ల క్రయ విక్రయాలను నిలిపివేయాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మూర్తికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధి కోళ్ల ద్వారా సంక్రమిస్తోందని, ఈ వైరస్ త్వరితగతిన విస్తరిస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ వైరస్ ప్రబలుతున్నందున అక్కడి కలెక్టర్ కోళ్ల క్రయ విక్రయాలపై నిషేధం విధించారని ధరణాలకోట శ్రీను తెలిపారు.

ఏలేశ్వరంలో సేవా కార్యక్రమాలు

ఏలేశ్వరం: మార్స్‌కంప్యూటర్, డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు తల్లి అడపా సత్యవతి 8వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని బాలుర, బాలికల వసతిగృహాలను చాపలు ఉచితంగా పంపిణీ చేశారు. లింగంపర్తిలో విశ్వహిందూ పరిషత్ ప్రచారకర్త ఎ.వీరభద్రరావు, అప్పలరాజు దంపతులకు బియ్యం, కిరాణా, కూరగాయలు ఉచితంగా అందజేశారు. ముందుగా సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తల్లి జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజు, ఉడతల రమణారావు, వసతిగృహాల సిబ్బంది సిద్ధాంతపు నూకరాజు, పోతుబంది దేవతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు లిబరేషన్ మద్దతు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన జరుగనున్న మన్యం బంద్‌కు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ పూర్తి మద్దతు ఇవ్వనున్నట్టు లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు తెలిపారు. పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్నిప్రతిఘటించాలని లిబరేషన్ పార్టీ డిమాండ్ చేస్తోందని బుగత బంగార్రాజు తెలిపారు.

పకడ్బందీగా ప్రీ పబ్లిక్ పరీక్షలు

ప్రత్తిపాడు: మండలంలో పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీ పబ్లిక్ పరీక్ష (హిందీ పరీక్ష)లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ పరీక్షలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 594 మంది, ఐదు ప్రైవేట్ పాఠశాలల నుంచి 320 మంది హాజరుకానున్నారని ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల సందర్శన

జగ్గంపేట: ఇర్రిపాకలో ఏలేరు నది తీరంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను రాజమండ్రి బ్రహ్మకుమారీలు మంగళవారం సందర్శించారు. ఏలేరు నది తీరం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. వారు టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. ఇర్రిపాకలో ఈనెల 17వ తేదీన జరుగుతున్న శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ గురించి నెహ్రూ వారికి వివరించారు. బుధవారం రాజమండ్రి నుంచి ఊరిగింపుగా ఇర్రిపాక తీసుకురానున్నట్టు తెలిపారు.

ఆనందం.. ఆరోగ్యం

- చిన్నారులు, యువతకు ఆట విడుపు
- ప్రజలకు ఆహ్లాదం పంచుతున్న పార్కు
- సాయంత్రం వేళల్లో విద్యుత్ వెలుగులు
- అందరినీ ఆకర్షిస్తున్న ఆట వస్తువులు

తుని: ప్రజలకు మానసిక ఉల్లాసం, వ్యాయామం, చిన్నారులకు ఆటలు అన్ని రకాల సదుపాయాలు ఒక్కచోట ఉంటే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. ఉదయం నుంచి సాయంత్రం ఉద్యోగ, వ్యాపార, విద్య తదితర పనులతో అసిపోయిన ప్రజలకు సేద తీరేందుకు అవసరమైన పార్కు అందుబాటులోకి రావడంపై అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గణపతినగర్‌లో మున్సిపల్ పాలక సంఘం హయాంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన పార్కు తుని పట్టణానికి ఐకాన్ నిలిచింది. ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులతో కిటకిటలాడుతోంది.

పార్కుకు వందల సంఖ్యలో జనం

గణపతినగర్ పొట్టిశ్రీరాములు మున్సిపల్ పార్కుకు రోజూ వందల సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. పట్టణంలోని 30 వార్డుల్లో ఎక్కడ అన్ని సదుపాయాలు ఉన్న పార్కు లేదు. గత పాలకులు ప్రజల అవసరాలను గుర్తించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీ నిధులు, బీపీఎస్, ఆర్థిక సంఘం, మున్సిపల్ జనరల్ ఫండ్స్ తదితర వాటి ద్వారా రూ.కోటి వరకు నిధులతో నిర్మించారు. ఇందులో లాన్, విద్యుద్దీపాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఇక ఉదయం సాయంత్రం వేళల్లో వాకర్స్ వాకింగ్ చేస్తున్నారు.

పార్కులో ఏర్పాటు చేసిన వస్తువులు

పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆడిటోరియం ఏర్పాటు చేశారు. వాకింగ్ చేసిన తర్వాత చిన్నల నుంచి పెద్దల వరకు విశ్రాంతి పొందుతున్నారు. యువకులు దృఢంగా ఉండేందుకు అధునాతన వ్యాయామ పరికరాలు, షటిల్ కోర్టు, పిల్లలకు ఉయ్యాలాలు, జారుడు బల్లలు తదితర ఆటవస్తువులు ఉన్నాయి. వీటిలో చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతున్నారు. తునితోపాటు పాయకరావుపేట నుంచి సందర్శకులు వస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించిన పాలకవర్గాన్ని అందరు అభినందిస్తున్నారు.



తుని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న సందర్శకులు



ఆటవస్తువులతో కేరింతలు కొడుతున్న చిన్నారులు



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువత

ఎంతో సంతోషం



మా పాలకవర్గ హయాంలో నిర్మించిన మోడల్ పార్కు పట్టణానికి వన్నె తెచ్చింది. ప్రతి రోజు వందల సంఖ్యలో సందర్శకులు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అందించిన సహకారంతో నందన వనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. కుటుంబం అంతా ఆనందం పంచుకునే వేదిక అందుబాటులో ఉండడం ఆనందంగా ఉంది. -ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

చిన్నారులకు ఆట విడుపు



పుస్తకాలతో కుస్తీలు పట్టే చిన్నారులు సాయంత్రం సమయంలో పార్కులో ఆనందంగా గడుపుతున్నారు. పురపాలకసంఘం అన్ని సదుపాయాలు కలిగిన పార్కును అందుబాటులోకి తీసుకువచ్చింది. చిన్నారులు ఆట వస్తువులతో సందడి చేస్తున్నారు. యువకులు జిమ్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడి శారీరిక ధృడత్వాన్ని పెంచుకుంటున్నారు. -ఎస్.నిరంజన్, వాకర్, తుని

న్యూట్రీ గార్డెన్లతో ఆరోగ్యకర వంటకాలు

తుని రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆరోగ్యకరమైన వంటకాలకు న్యూట్రీ గార్డెన్లు ఎంతో ప్రయోజనకరమని స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి (ఐసీడీఎస్ పీడీ) విజయకుమారి అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరు, తేటగుంట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. టీహెచ్‌ఆర్ రికార్డులు, నిత్యావసర సరకులను ఆమె తనిఖీ చేశారు. ఆటపాటలపై పిల్లల ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో న్యూట్రీ గార్డెన్ల నిర్వహణ బాధ్యతలు కార్యకర్తలకు, ఆయాలకు అప్పగించామన్నారు. అందులో పండించిన కూరగాయలతో పిల్లలకు ఆరోగ్యకరమైన వంటకాలు చేయాలని అంగన్‌వాడీలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చేరిన నిత్యావసర సరకులను లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. అన్ని సరకులు ఒకేసారి ఇవ్వాలని నిల్వ ఉంచొద్దన్నారు. పీడీ వెంట సీడీపీఓ కె.శ్రీలత పాల్గొన్నారు.



వి.కొత్తూరు అంగన్‌వాడీ కేంద్ర ప్రాంగణంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న పీడీ విజయకుమారి

పోలీసుల తీరు మార్చుకోకుంటే ఉద్యమిస్తాం

తొండంగి: టీడీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ దళితుని స్థలం కబ్జా చేసేందుకు సహకరించిన పోలీసులు తీరు మార్చుకోవాలని, లేకుండా ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొండేపూడి శ్యాంబాబు అన్నారు. మంగళవారం ఒంటిమామిడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమామిడికి చెందిన పెదపూడి శ్రీను అనే రమణ తాటియాకులపాలెం పరిధిలో కొనుగోలు చేయగా టీడీపీకి చెందిన నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించారన్నారు. ఈ వ్యవహారంలో బాధితుడు తుని సివిల్ కోర్టును ఆశ్రయించాడన్నారు. కాగా ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా తొండంగి ఎస్సై జగన్మోహన్ రావు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు టీడీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ బాధితుడు రమణ, అతని కుటుంబ సభ్యులపై అక్రమంగా కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసులు తీరు మార్చుకుని బాధితుని న్యాయం చేయాలన్నారు. పోలీసులు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ దండోరా సీనియర్ నాయకుడు కొండేపూడి శ్యాంబాబు

సంపద తయారీ కేంద్రాల తనిఖీ

జగ్గంపేట: మండలంలోని 16 పంచాయతీలలో వున్న చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను ఈఓపీఆర్డీ ఎం.ఎస్.భాస్కరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించే స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి మండలంలోని అన్ని సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ అధికారులను సూచించినట్టు తెలిపారు. మండలంలో 9 పంచాయతీల్లో సంపద కేంద్రాలు వినియోగంలో ఉన్నాయని, వాటి నుంచి తయారు చేసిన వర్మీ కంపోస్టును రైతులకు అందజేసినట్టు తెలిపారు. మరో 7 గ్రామాలలో పాక్షికంగా సంపద కేంద్రాలు పనిచేస్తున్నాయని, వాటిని తక్షణం వినియోగంలోకి తేవాలని ఈనెల 14తేదీ నుంచి వాటి నుంచి వర్మీ కంపోస్టు ఉత్పత్తి చేయాలని చెప్పామన్నారు. మండలంలో కాండ్రేగుల, మన్యవారిపాలెం, వెంగాయ్యమ్మపురం, నరేంద్రపట్నం, గుర్రంపాలెం, కాట్రావులపల్లి గ్రామాలలో సంపద కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు. రామవరంలో శ్మశానంలో నిర్మించిన సంపద కేంద్రాన్ని వేరే అవసరాలకు వినియోగిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో పరిశీలించామని అక్కడ సంపద తయారీకి అధికారులు సిద్ధం చేశారని చెప్పారు.

రేషన్ బియ్యం సీజ్

తొండంగి: బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ మధుబాబు, పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మయ్యపేట శివారులో మహారాష్ట్ర నుంచి అనకాపల్లి వెళ్తున్న లారీని పట్టుకున్నారు. లారీలో 20 టన్నుల బియ్యాన్ని గుర్తించారు. లారీలో ఉన్న ఏ.నాగేశ్వర రావును అదుపులోకి తీసుకుని, లారీని సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఆయన వెంట ఎంఎస్ఓ రాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై వినూత్న ప్రచారం

తొండంగి: నిత్యం రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్న తరుణంలో ప్రమాదాల నివారణపై కత్తిపూడి రవాణాశాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ మంగళవారం బెండపూడి జాతీయ రహదారిపై కళాశాల విద్యార్థులతో కలిసి వినూత్న ప్రచారం నిర్వహించారు. 36 రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖాధికారి శ్రీధర్ ఆదేశాల మేరకు బెండపూడి శివారు పాత చెక్‌పోస్టు వద్ద ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బైక్‌పై వెళ్తున్న వారు హెల్మెట్ ధరించిన వారికి, కారులో సీటు బెల్ట్ ధరించిన వారికి గులాభి పువ్వు, మ్యాంగో ఫ్రూటీతో అభినందించారు. రవాణాశాఖ నిబంధనలు పాటించని బైకు, కార్ల వాహనదారులకు గతంలో పలు సందర్భాల్లో జరిగిన ప్రమాదాలను వివరించి, హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, సురక్షితంగా గమ్యాన్ని చేరడం బాధ్యతగా భావించి ప్రయాణాలు సాగించాలన్నారు. నిబంధనలు పాటించకుండా అతివేగంగా ప్రయాణాలు చేసే వాహనాలను కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అపరాధ రుసుంలు విధించి, కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ మోటార్ వేహికల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, కళాశాల విద్యార్థులు ఉన్నారు.



జాతీయ రహదారిపై సీటు బెల్ట్ ధరించిన కారు యజమానికి ఫ్రూటీలు ఇస్తున్న ఎంవీఐ శ్రీనివాస్, విద్యార్థులు

మహా కుంభమేళాకు బయలుదేరిన బస్సులు

తుని: పవిత్ర మహా కుంభమేళా యాత్రకు తుని నుంచి రెండు బస్సులు మంగళవారం సాయంత్రం బయలుదేరినట్టు డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. భక్తులు ముందుగానే నాన్ ఏసీ స్లీపర్ బస్సులకు టికెట్టు బుక్ చేసుకున్నారన్నారు. తుని నుంచి బయలుదేరిన బస్సులు 10 రోజుల పాటు యాత్ర ముగించుకుని ఈ నెల 18న తుని చేరుకుంటాయని చెప్పారు. భువనేశ్వర్, పూరీ, కోణార్క్, ప్రయాగ, కాశీ, అయోధ్య దివ్య క్షేత్రాల దర్శనం చేసుకుంటారన్నారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు.



తుని నుంచి బయలుదేరుతున్న భక్తులు

మహిళ వేషంలో దోపిడీ

జగ్గంపేట: మహిళగా అలంకరించుకున్న ఓ పురుషుడు.. తన దగ్గరకు వచ్చిన యువకుడిపై దాడికి పాల్పడి బంగారాన్ని దోచుకున్నాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటలో శివారు గుర్రంపాలెం వెళ్లే రోడ్డులో ఓ వ్యక్తి.. మహిళా వేషధారణలో అటుగా వెళుతున్న వారిని ఆకర్షిస్తున్నాడు. అతడిని మహిళగా భావించి వచ్చిన ఓ యువకుడిపై దాడి చేసి, రూ.లక్ష విలువైన బంగారు గొలుసు చోరీ చేశాడు. ఆ ప్రాంతంలోని ట్రాన్స్ జెండర్లతో కలిసి ఉంటూ ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో బంగారు గొలుసు పోగొట్టుకున్న బాధితుడు.. పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా కొందరు ట్రాన్స్‌జెండర్ల ఫొటోలు చూపించడంతో వారిలో ఒకరిని బాధితుడు గుర్తించాడు. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంత నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

సారాతో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించి, ముగ్గురు సారా విక్రేతలను అదుపులోకి తీసుకుని, ఇరవై లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు శంఖవరం మండలం మండపం గ్రామంలో సారా విక్రయిస్తున్న తిరగటి లోవరాజు, పులుగు సత్తిబాబులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో పది లీటర్ల సారాతో జుత్తుక పాపారావును అదుపులోకి తీసుకున్నామని, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

గ్యాస్ లీకై భార్యా భర్తలకు గాయాలు

జగ్గంపేట: గోవిందపురం గ్రామంలో కాపవరపు దుర్గారావు ఇంటిలో తెల్లవారు జామున గ్యాస్ లీకై మంటలు వ్యాపించి భార్యా భర్తలకు గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు దుర్గారావు తెల్లవారుజామున టీ పెట్టుకోవడానికి గ్యాస్ స్టౌవ్ వెలిగించగా సిలిండర్ వద్ద నుంచి పెద్దగా మంటలు వ్యాపించాయి. అదే సమయంలో వచ్చిన తన భార్యకు మంటలు చుట్టుముట్టడంతో గాయాలైనట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో వంటింట్లో ఉన్న విలువైన ఫ్రిజ్, గృహపకరణాలు, సెల్‌ఫోన్లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. స్థానికులు అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన తక్షణం వచ్చి మంటలు ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మోటారు సైకిళ్లు ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

కిర్లంపూడి: ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొట్టడంతో అయినాల సీతారామరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు మంగళవారం హెచ్‌సీ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ప్రత్తిపాడు కొత్తపేటకు చెందిన అయినాల సీతారామరాజు ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా ప్రత్తిపాడు వైపు నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టుకోవడంతో సీతారామరాజు తలకు బలంగా గాయాలయ్యాయి. దీంతో స్థానిక ప్రత్తిపాడు పీహెచ్‌సీకి తరలించంగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు సోదరిడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

గండేపల్లి: తాళ్లూరు పంచాయతీ పరిదిలోని చెరువులో చెట్లను నరికిన వారిని గుర్తించి వారి వివరాలతో సహా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి షకీల మంగళవారం తెలిపారు. ఆమె వివరాల మేరకు ఆదివారం కొందరు వ్యక్తులు చెరువులో చెట్లను నరికి ట్రాక్టర్‌పై తరలించుకుపోయారని, అయితే వారు గ్రామస్తులేనని తెలియడంతో వారిపై ఫిర్యాదు చేసినట్టు తెలియజేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమే కక్ష సాధింపు దాడులు

కిర్లంపూడి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమే ఈ కక్ష సాధింపు దాడులని, మీ దాడులను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరాని పలువురు బీసీ, ఎస్సీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పలువురు యాదవ్ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముద్రగడ పద్మనాభంను, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా ప్రెసిడెంట్ అల్లి రాజుబాబుయాదవ్, రంగంపేటం మండలం ఒడిసిలేరు కోలాటి ఇజ్రాయిల్, సారిపల్లి సత్యనారాయణ(దత్తుడు) మాట్లాడుతూ బెదిరింపుల రాజకీయాల్లో భాగంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై కొంతమంది సైకోలు దాడికి పాల్పడిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇలాంటి కుట్ర రాజకీయాలు మరోసారి పునరావృతం అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకుల సత్తా ఎంటో చూపిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. నాడు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి కుటుంబానికి ఏదోరూపన సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని, కూటమి ప్రజలను మోసం చేసిందని, దీంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో దాడులు, డైవర్షన్ పొలిటిక్స్ మొదలు పెట్టిందని, వైఎస్సార్ సీపీ క్లీన్‌చిట్ ఉన్న మున్సిపాలిటీల్లో కౌన్సలర్లను, కార్పొరేటర్లను బెదిరింపులకు గురిచేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రాజకీయాల ఎంతలా దిగజారిపోయాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముద్రగడ నివాసంలో దాడులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిక్కవోలు మండలం ఎంపీపీ బుద్దాల కన్నారావు, యాదవ్ సంఘం నాయకులు అనుసూరి ప్రభాకర్, సూరిబాబు, సోమరాజు తదితరులు ఉన్నారు.



ముద్రగడ పద్మనాభంను, గిరిబాబును కలిసి సంఘీభావం తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

కొబ్బరి చెట్లకూ బీమా

తుని రూరల్: రైతులు కొబ్బరి చెట్లకు బీమా చేయించాలని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో ప్రీమియం చెల్లింపు, బీమా ప్రయోజనాల వివరాలను ఆమె తెలిపారు. సంవత్సరం, రెండు, మూడు సంవత్సరాలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. ప్రీమియంలో 50 శాతాన్ని కోకోనెట్ డెవలప్‌మెంట్ బోర్డు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 25 శాతం రైతు వాటాగా చెల్లించాల్సి ఉందన్నారు. నాలుగు నుంచి 15 సంవత్సరాల వయస్సుగల చెట్లకి రూ.9, 16 నుంచి 60 సంవత్సరాల చెట్లకు రూ.14లు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. బీమా మొత్తం 4-15కి రూ.900, 16-60కి రూ.1750 వర్తిస్తుందన్నారు. మూడేళ్లకు ఒకేసారి ప్రీమియం చెల్లిస్తే అదనపు రాయితీ లభిస్తుందన్నారు. తుపాన్లు, వడగళ్లవాన, సుడిగాలులు, భారీ వర్షాలు, వరదలు, చీడపీడలతో చెట్లకు నష్టం, అగ్నిప్రమాదం, పిడుగుపాటు, భూకంపాలు, కొండచరియలు విరిగి పడడం, సునామీ, తీవ్రకరువు వంటి సందర్భాలలో బీమా వర్తిస్తుందన్నారు. బీమా చేసిన 30 రోజుల్లోపు నష్టం జరిగితే బీమా వర్తించదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి

తుని రూరల్: ఉన్నత లక్ష్యాలు సాధనకు విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నైపుణాలు పెంచుకోవాలని ఆఫిల్ సంస్థ సీనియర్ ఎమ్యులేషన్ వెరిఫికేషన్ మేనేజరు దేవరపల్లి సతీష్ అన్నారు. మంగళవారం సాయంత్రం వి.కొత్తూరులో గల తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత అధ్యక్షతన సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ పెట్టెల రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ, కోఆర్డినేటర్ డాక్టర్ పుష్పలత, అధ్యాపకులు వైఎస్.శ్రీనివాస్, డి.సరిత, ఇందిరా ప్రియాంక, సింహాద్రి పాల్గొన్నారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

గోకవరం: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 19 వరకు వారం రోజుల పాటు స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ ప్రాంగణంలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్గంపేట, రాజనగరం, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు 50 టీంలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. పోటీలు అనంతరం గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలుగా అందించనున్నామన్నారు.